సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



భీమేశ్వరస్వామికి వైభవంగా శ్రీపుష్పోత్సవం

కల్యాణోత్సవాల్లో భాగంగా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వారి శ్రీపుష్పోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు.


8లో



కోళ్లాహలం

కోళ్లు బర్డ్‌ఫ్లూ బారిన పడుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజలు, పౌల్ట్రీ యజమానులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తోంది.

8,850 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం



డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు

అమలాపురం రూరల్: ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ పట్ల అవగాహన పెంచుకుని అప్రమత్తతతో డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోనసీమ జిల్లా ప్రజారవాణాధికారి డి. శ్రీనివాసరావు సూచించారు. ఆర్టీసీలో రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా అమలాపురం డిపో గ్యారేజ్‌లో శుక్రవారం జరిగిన ముగింపు సభలో జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీలో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించామన్నారు. జిల్లా స్థాయిలో ముగ్గురు, డిపో స్థాయిలో 12 మంది యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లను ప్రశంసా పత్రాలతో సత్కరించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్ సాయంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అమలాపురం, రావులపాలెం, రాజోలు డిపోల నుండి 62 మంది రక్తదానం చేసారు. వీరబాబు, అమలాపురం, రావులపాలెం, రాజోలు, రామచంద్రపురం డిపో మేనేజర్లు చల్లా సత్యనారాయణ మూర్తి, ఎఎం రమణ, ధనమ్మ, భాస్కర్‌రావు, ఆర్టీసి అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆదాయం రూ.47,89,784



అంతర్వేది ఆలయంలో హుండీల లెక్కింపు

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారికి భక్తుల నుంచి విరాళాల రూపంలో వివిధ హుండీల ద్వారా మొత్తం రూ.47,89,784 ఆదాయం చేకూరింది. గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 14వ తేదీ వరకూ 17 రోజులకు హుండీల లెక్కించారు. శుక్రవారం అంతర్వేది ఆలయంలో ఎండోమెంట్స్ డీసీ డీఎల్‌వీ రమేష్‌బాబు, అమలాపురం ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ జే రామలింగేశ్వరరావు సమక్షంలో హుండీలు తెరచి లెక్కించగా స్వామివారికి పై ఆదాయం వచ్చింది. మెయిన్ హుండీల ద్వారా రూ.46,76,268, గుర్రాలక్క అమ్మవారి ఆలయ హుండీ ద్వారా రూ.86,241, అన్నదానం హుండీల ద్వారా రూ.27,275 వచ్చినట్టు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 8.500 గ్రాముల బంగారం, 104.370 గ్రాముల వెండి వస్తువులు వచ్చినట్టు చెప్పారు. లక్ష్మీనృసింహుని దేవస్థానంకు అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.47,587 ఆదాయం వచ్చిందన్నారు. చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాలరాజా బహద్దూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పీఈటీలకు డీఈవో అభినందన



విజేతలను అభినందిస్తున్న డీఈవో సలీమ్ బాషా

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన సెమినార్ కం స్పోర్ట్స్ మీట్‌లో పలు కీడల్లో ప్రతిభ చాటి విజేతలైన పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు జిల్లాకు పేరు తెచ్చారని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా అన్నారు. ఆ స్పోర్ట్ మీట్‌లో విజేతలైన పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు స్థానిక నల్ల వంతెన వద్ద గల డీఈవో నివాసంలో డీఈవో బాషాను కలిసి తాము సాధించిన పతకాలు, బహుమతులను ఆయనకు చూపించారు. విజేతలను డీఈవో అభినందించి సత్కరించారు. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలైన ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు రవి, మధు, సురేష్, సతీష్, ఐశ్వర్య, నాగదుర్గ, సూర్యకుమారి, నరసింహరావులతోపాటు పీఈటీ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు మూర్తి, ప్రసాద్, రామారావు, ఈశ్వరరావు, గణేష్, ముసలయ్యలు డీఈవోను కలిసిన వారిలో ఉన్నారు. డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామ్స్ బోర్డు సెక్రటరీ హనుమంతరావు సైతం విజేతలైన ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలను అభినందించారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్రికెట్, బాస్కెట్ బాల్ క్రీడల్లో జిల్లాకు సంబంధించి పై ఎనిమిది మంది పీడీలు, పీఈటీలు విజేతలై పతకాలు, షీల్డ్‌లు సాధించారు.

ఇదేం పర్యాఆటకం?

- **శిథిలస్థితిలో అరుదైన నిర్మాణాలు**
- **కోనసీమ జిల్లాలో బ్రిటిష్ కాలం నాటి లాకులు, అక్విడెక్టులు**
- **నిర్లక్ష్యంతో శిథిలావస్థకు**
- వాటి వద్ద సినిమా షూటింగ్‌లు
- పర్యాటక ప్రోత్సాహానికి అవకాశాలు
- ఏమాత్రం పట్టించుకోని పర్యాటక శాఖ



పి.గన్నవరం పాత అక్విడెక్టు



అన్నంపల్లి పాత అక్విడెక్టు

ఐ.పోలవరం/ పి.గన్నవరం: తమిళనాడులోని రామేశ్వరం వెళ్లేందుకు నిర్మించిన పంబన్ పాత వంతెనను పర్యాటక కట్టడంగా తీర్చిదిద్దాలనే డిమాండ్ పెరుగుతోంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద గోదావరిపై ఉన్న హేవలాక్ వంతెనను సైతం పర్యాటక ప్రాంతంగా మార్చాలని కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో పి.గన్నవరం పాత అక్విడెక్టుతోపాటు ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల మధ్య ఉన్న అన్నంపల్లి పాత అక్విడెక్టును పర్యాటక ప్రాంతాలుగా మార్చాలనే డిమాండ్ ఉంది.

గోదావరి డెల్టా వ్యవస్థలో తాగు... సాగునీరు పంపిణీలో కీలకంగా సేవలందించిన.. ఇప్పటికీ అందిస్తున్న కీలక కట్టడాలు సాగునీటి పారుదల శాఖల అధికారులు నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరుతున్నాయి. బ్రిటిష్ కాలంలో నిర్మించిన పంట కాలువలపై లాకులు.. అక్విడెక్టులు ఉన్నాయి. వీటిలో చాలా కట్టడాలు పర్యాటక ప్రాంతాలుగా పేరొందాయి. పలు సినిమాల షూటింగ్‌లు సైతం జరిగాయి. ముఖ్యంగా ఆత్రేయపురం మండలం లొల్ల లాకులు, రాయవరం మండలం పలసపూడి లాకులతోపాటు కడియం లాకుల వద్ద పలు సినిమాల షూటింగ్‌లు జరిగాయి. వీటితోపాటు పి.గన్నవరం, అన్నంపల్లి పాత అక్విడెక్టుల వద్ద కూడా సినిమా షూటింగ్‌లు జరిగాయి. ఇవి పర్యాటక ప్రాంతాలుగా కూడా గుర్తింపు సంతరించుకున్నాయి.

ఆగిన పర్యాటకాభివృద్ధి



పి.గన్నవరం పాత అక్విడెక్టుపై నిలిచిపోయిన ఆర్చుల నిర్మాణ పనులు

రాజోలు దీవికి సుదీర్ఘకాలం పాటు సేవలందించిన పి.గన్నవరం అక్విడెక్టును 1845లో నిర్మించారు. ఇది 2000వ సంవత్సరం వరకు సేవలందించింది. తరువాత కొత్త అక్విడెక్టు నిర్మాణం అందుబాటులోకి రావడంతో దీని సేవలు ఆగిపోయాయి. దీనిని పర్యాటక ప్రాంతంగా మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు. 2010లో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో రూ.10 లక్షలతో అక్విడెక్టుపై పర్యాటకులు కూర్చునేందుకు ఆర్చ్‌లు, బెంచ్‌ల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణాల వల్ల అక్విడెక్టుకు అనుబంధంగా నిర్మించిన వంతెనపై వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖ నుంచి అభ్యంతరాలు వచ్చాయి. ఇప్పుడున్న కొత్త అక్విడెక్టు కమ్ రోడ్డు మీద భారీ ప్రమాదాలు జరిగితే ప్రత్యామ్నాయంగా పాత వంతెనను వినియోగించాల్సి ఉన్నందున నిర్మాణాలు నిలుపుదల చేశారు. తరువాత పలు సందర్భాలలో పర్యాటక ప్రతిపాదనలు వచ్చినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి.



శిథిలావస్థకు చేరుతున్న పి.గన్నవరం పాత అక్విడెక్టు

శిథిలావస్థకు అన్నంపల్లి అక్విడెక్టు



శిథిలావస్థకు చేరిన అన్నంపల్లి అక్విడెక్టు

అన్నంపల్లి పాత అక్విడెక్టు శిథిలావస్థకు చేరింది. దీనిని 1929 సంవత్సరంలో నిర్మించారు. నాటి నుంచి ఇది ఐలెండ్‌కు తాగు, సాగునీరు అందిస్తోంది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి డెల్టా ఆధునీకరణ నిధులు కేటాయించడంతో 2015లో కొత్త అక్విడెక్టు వినియోగంలోకి వచ్చిన తరువాత పాత అక్విడెక్టును గాలికి వదిలేశారు. దీనిని పర్యాటక ప్రాంతంగా మార్చాలనే డిమాండ్ ఉంది. రంగులు వేసి, రైలింగ్ నిర్మాణంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, అక్విడెక్టు తొట్టిలో బోటింగ్ సౌకర్యం కల్పించాలనే ప్రతిపాదన ఉంది.

చారిత్రక లాకులపైనా అదే నిర్లక్ష్యం

డెల్టా పంట కాలువలపై ఉండే లాకులు అనగానే గుర్తుకు వచ్చేది లొల్ల లాకులు. ఇది సినిమా షూటింగ్‌కు పెట్టింది పేరు. ఇప్పుడు ఇది కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతోపాటు రాయవరం మండలం పసలపూడి, అమలాపురం శివారు చింతలపూడి, ఆలమూరు మండలం చొప్పెల్ల, తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కడియం లాకులు సైతం పర్యాటక ప్రాంతాలే. ఇవి నిర్లక్ష్యానికి గురయ్యాయి. వీటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తే మంచి ఫలితం ఉంటుందని స్థానికులు కోరుతున్నా పట్టించుకునేవారు లేరు.



శిథిలావస్థకు చేరిన లొల్ల లాకులు

ఎన్‌ఎంఎంఎస్‌కు 11 మంది ఎంపిక



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

అల్లవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు అల్లవరం మండలం నుంచి 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ కిరణ్‌బాబు శుక్రవారం తెలిపారు. కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాల నుంచి బండారు ప్రదీప్, చల్లపల్లి తేజ, యర్రంశెట్టి వాణి మహాలక్ష్మీ, నార్ని మౌనిక ప్రియలక్ష్మీ, నాగ ప్రైస్సీ, పితాని శ్రీవల్లి, యాళ్ల చైత్ర, విజ్ఞాన లలితనాగ భాగ్యశ్రీ, ఓలేటి మాధవి కారుణ్య, ఓడలరేవు ఉన్నత పాఠశాల నుంచి దండుప్రోలు స్వాతి, అల్లవరం ఉన్నత పాఠశాల నుంచి పెస్సింగు రాజ రాజేశ్వరీ ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. ఈ పథకం ద్వారా నాలుగేళ్లపాటు రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ పొందుతారన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, కేఎస్ఆర్ మూర్తి, ఎన్.వెంకటేశ్వరరావు, విద్యార్థులను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు అభినందించారు.

తల్లిదండ్రులను కోల్పోయిన వారు దరఖాస్తు చేసుకోండి

అమలాపురం రూరల్ కోవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన 18 ఏళ్ల లోపు బాలబాలికలు పీఎం కేర్ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ ఆర్. మహేశ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు 2020 మార్చి 11 నుంచి 2023 మే5 మధ్య కాలంలో కోవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన వారు మాత్రమే అర్హులన్నారు. ఇంతవరకు నమోదు చేసుకోని వారు వెంటనే పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

అపార అనుభవశాలి సంజీవయ్య



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ నిషాంతి, అధికారులు

అమలాపురం రూరల్: అపార అనుభవశాలి దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి పనిచేశారని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో దామోదరం సంజీవయ్య 104వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంజీవయ్య ఆశయాలను ఆచరించడమే ఆయనకు అర్పించే నివాళి అన్నారు. సంయుక్త మద్రాసు రాష్ట్రంలో, ఆంధ్రరాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వంలో అనేకసార్లు ఆయన మంత్రి పదవులు నిర్వహించగా, రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేసిన ప్రత్యేకత ఆయనదన్నారు. 38 ఏళ్ల చిన్న వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వంలో తెలుగు భాష వాడుక అధికం చేయడం, భూసంస్కరణల అమలు వంటి ఎన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలు ఆయన హయాంలో చేపట్టారన్నారు. ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, ఏవో విశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్లు మురళీకృష్ణ, రమణకుమారి ఎల్డిఎం కేశవ వర్మ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి పి. జ్యోతిలక్ష్మి దేవి, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ ఈ కేవైసీ అప్డేషన్ తప్పనిసరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల లబ్ధిని పొందేందుకు ప్రతి ఒక్కరు ఆధార్ నమోదు బయోమెట్రిక్ ఈ కేవైసీ అప్డేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఆధార్ నమోదు, అప్డేషన్, సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరూ చైల్డ్ ఆధార్‌ను ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు, గ్రామ వార్డు సచివాలయాల ద్వారా జనన ధ్రువపత్రాలు పొందుతూ వాటి ఆధారంగా నమోదు చేయించుకోవాలన్నారు. ఐదు సంవత్సరాలు పైబడి ఏడు సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. కోనసీమ జిల్లాలో 7-17 సంవత్సరాల మధ్య వయస్సు గల బాల బాలికలు లక్ష మంది వరకు ఉన్నారని వీరందరూ తప్పనిసరిగా సమీపంలోని గ్రామ వార్డు సచివాలయాలు కామన్ సర్వీస్ కేంద్రాలల్లో ఆధార్ బయోమెట్రిక్, అప్డేట్ చేయించుకోవాలని లేని పక్షంలో పాస్‌పోర్ట్, విద్యార్థులకు ఉపకార వేతనాలు ఉన్నత చదువులకు సంబంధించిన ప్రవేశాలలో ప్రభుత్వ పథకాల రాయితీలు పొందడంలో పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని స్పష్టం చేశారు. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ సహాయ మేనేజర్ గిరిధర్ జిల్లాలో జీఎస్ డబ్ల్యూ ఎస్, కామన్ సర్వీస్ సెంటర్, పోస్టల్ అధికారులు లీడింగ్ బ్యాంకుల ప్రతినిధులకు ఆధార్ అప్డేషన్‌పై సందేహాలను నివృత్తి చేశారు.

ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థులు పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ శారద

అమలాపురం టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పెరుగుదల కనిపించాలని ఇంటర్మీడియెట్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ఐ.శారద సూచించారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆమె శుక్రవారం సందర్శించి ప్రభుత్వ కళాశాలల్లో బాలిక విద్య ఆవశ్యకత గురించి వివరించారు. జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో) వనుము సోమశేఖరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శారద ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలు తక్కువేనని చెబుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతీ విద్యార్థిని ప్రభుత్వ కళాశాలల్లో చేర్చేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని పేర్కొన్నారు. డీఐఈవో సోమశేఖరరావు మాట్లాడుతూ విద్యార్థినులను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించేందుకు జిల్లాలోని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ముందే రూపొందించుకున్న ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఆ విద్యార్థినుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారని, అవసరమైతే ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్నారని ఆర్‌జేడీకి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.కృష్ణ కిషోర్, సీనియర్ అధ్యాపకురాలు కడియం శిరీష, కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.లక్ష్మణరావు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న సుందర్

రాజమహేంద్రవరం సిటీ: శాసన మండలి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని అనర్హుడిగా ప్రకటించాలని స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్ ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. స్థానిక రాజీవ్‌గాంధీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లను తరలించేందుకు కూటమి అభ్యర్థి టికెట్లు ఇస్తున్నారని, దీనిపై సీఈఓకు మెయిల్ పంపానని చెప్పారు. రిటర్నింగ్ అధికారి వెంటనే స్పందించి పేరాబత్తుల రాజశేఖరాన్ని డిస్క్వాలిఫై చేసి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి జాబితాలో నంబర్ కేటాయింపుపై కూడా పలు సందేహాలున్నాయన్నారు. అక్షరక్రమంలో పీడీఎఫ్ అభ్యర్థి వీర రాఘవులుకు, స్వతంత్ర అభ్యర్థినైన తనకు ఏ ప్రాతిపదికన నంబర్లు ఇచ్చారో అనుమానాలున్నాయని చెప్పారు. క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ఓటర్లను ఏవిధంగా మభ్యపెడుతున్నారో సుందర్ లైవ్‌లో వివరించారు. కూటమి అభ్యర్థి ఓటర్ స్లిప్పులలో ఫోన్ నంబర్లు, అడ్రస్, జియో లొకేషన్ కూడా ఉన్నాయని ఆరోపించారు. దీనిపై ఈ నెల 9న విజ్ఞాపన ఇచ్చానని, 12న సీఈఓకు మెయిల్ పంపానని చెప్పారు. రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడానికి గురువారం వెళ్లానని, ఆయన లేకపోవడంతో డీఆర్‌ఓకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి



సబ్‌ట్రెజరీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ట్రెజరీ అధికారి రామనాథం

రాయవరం: పెన్షనర్లు ఈ నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని జిల్లా ట్రెజరీ అధికారి రామనాథం తెలిపారు. రాయవరం సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రామనాథం మాట్లాడుతూ ఏటా పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ నెలాఖరులోగా ప్రతి పెన్షనరు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఉన్న 80 శాతం మంది పెన్షనర్లు ఇప్పటికే లైఫ్ సర్టిఫికెట్లు అందజేశారన్నారు. అనంతరం ఆయన సబ్‌ట్రెజరీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. కార్యాలయంలో ఆర్థిక లావాదేవీలను పరిశీలించి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సబ్‌ట్రెజరీ అధికారులున్నారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

రాయవరం: పాఠశాల విద్యాశాఖ ఆదేశాల ప్రకారం శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రతి నెలా నిర్వహించే సమావేశాలను ఇకపై ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా జిల్లావ్యాప్తంగా రీఆర్గనైజేషన్ చేసిన 87 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ఈ సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో జిల్లావ్యాప్తంగా 1,582 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 5,430 మంది ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొననున్నారు. సాధారణంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు రెండు రోజుల పాటు నిర్వహించేవారు ఇకపై కేవలం ఒక పూట మాత్రమే కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం 11.45 గంటలకు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులకు అందజేసిన అనంతరం విద్యార్థులను ఇంటికి పంపించనున్నారు. ఉపాధ్యాయులు మధ్యాహ్నం 1గంటకు వారికి కేటాయించిన స్కూల్ కాంప్లెక్స్‌లకు చేరుకుని, సమావేశాల్లో పాల్గొననున్నారు.

కుంభమేళాకు మూడు ప్రత్యేక బస్సులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం 3 సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరి వెళ్లాయని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) కుమారి కె.షర్మిల అశోక తెలిపారు. ఈ యాత్రలో భక్తులు కుంభమేళాతో పాటు భువనేశ్వర్, పూరి, కోణార్క్, గయ, బుద్ధగయ, వారణాసి, అరసవిల్లి క్షేత్రాల దర్శనానంతరం తిరిగి 22న రాజమహేంద్రవరం చేరుకుంటారని వివరించారు. ఒక్కో బస్సులో 36 మంది భక్తులు వెళ్లారన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఎస్‌కే షబ్బం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రైల్వేస్టేషన్‌లో వృద్ధుడి మృతి


అనారోగ్యంతో మృతిచెందిన అడవిరాజు

తుని: స్థానిక రైల్వేస్టేషన్‌లో అనారోగ్యంతో అడవిరాజు (70) మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్టేషన్ మేనేజరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ప్రకారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం పెదతీనార్ల గ్రామానికి చెందిన అడవిరాజుగా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైలు ఢీకొని మృతి చెందిన వ్యక్తి

తుని: స్థానిక తాళ్లూరు రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని (45) ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం అన్నవరం నుంచి తుని వైపు వస్తున్న గుర్తు తెలియని రైలు, పట్టాలు దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు ఫుల్ చేతుల చొక్కా, ముక్కుపొడి రంగు ఫుల్ ప్యాంటు ఉన్నాయని చెప్పారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి


మృతుడు నాగేశ్వరరావు

సఖినేటిపల్లి: రొయ్యలకు మేత వేస్తూ చెరువు వద్ద విద్యుత్ మోటార్ వైరు తగిలి మండల పరిధిలోని కేశవదాసుపాలెంలో యు.నాగేశ్వరరావు (49) శుక్రవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నాగేశ్వరరావు రొయ్యల చెరువు సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో రొయ్యలకు మేత వేస్తుండగా కరెంటు షాక్‌కు గురై పడిపోయారు. చుట్టుపక్కల వారు గుర్తించి హుటాహుటిన రాజోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే నాగేశ్వరరావు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. నాగేశ్వరరావు భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కోళ్లాహాలం


పక్షులకు సోకే బర్డ్‌ఫ్లూ వైరస్

- కోళ్ల రైతులను కుదిపేస్తున్న బర్డ్ ఫ్లూ వైరస్
- చికెన్ క్రయ విక్రయాలపై తీవ్ర ప్రభావం
- కనీస జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వెటర్నరీ శాఖ

ఆలమూరు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను బర్డ్‌ఫ్లూ వ్యాధి వణికిస్తోంది. పౌల్ట్రీ రంగానికి ప్రఖ్యాతి గాంచిన ఉమ్మడి జిల్లాలో వేలాది కోళ్లు ఫారాల్లోనే మృతి చెందడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. బర్డ్ ఫ్లూ వలస పక్షుల నుంచి సోకిందని, ఇప్పటి వరకూ ఫారం, బాయిలర్ కోళ్లపై తప్ప మనుషులపై ఎటువంటి ప్రభావం లేదని ఉమ్మడి జిల్లాల అధికార యంత్రాంగం ప్రకటించింది. బర్డ్ ఫ్లూ వైరస్ కేవలం 30 డిగ్రీలకు పైగా వేడి ఉంటే జీవించే అవకాశం లేదని నిపుణులు వివరిస్తున్నా ప్రజల్లో ఏమాత్రం భయాందోళనలు తగ్గడం లేదు. చాలా వరకూ చికెన్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు మూతబడ్డాయి. రెస్టారెంట్లలో చికెన్ తినేవారి సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతోంది. దీంతో వ్యాపారులు తీవ్ర నష్టాల బారిన పడుతున్నారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కానప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పశుసంవర్ధకశాఖ అప్రమత్తమైంది. కోళ్ల ఫారాలను తనిఖీ చేసి వ్యాధి లక్షణాలను గుర్తించేందుకు వీలుగా రాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం లేదు

శీతాకాలం ఉంచి వేసవికాలంలోకి ప్రవేశించే ముందు పక్షుల్లో సాధారణంగా బర్డ్ ఫ్లూ వైరస్ అధికంగా ఉంటుంది. పక్షుల నుంచి మనుషులకు సంక్రమిస్తుంది కాని మనుషుల నుంచి మరొకరికి సోకే అవకాశం లేదు. ఒకవేళ లక్షణాలను బట్టి వైరస్ సోకిందని నిర్ధారణకు వస్తే సత్వరమే వెంటిలేటర్‌పై చికిత్సను అందించవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా అలెర్ట్ జోన్ నుంచి మినహా మిగతా ప్రాంతాల్లో చికెన్, కోడిగుడ్లను నిస్సందేహంగా తినవచ్చునని కోనసీమ జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రకటించింది.

నిరోధానికి జాగ్రత్తలే మేలు


- బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందిన ప్రాంతాల నుంచి చికెన్, గుడ్లు రవాణా చేయరాదు.
- వంట చేసే ముందు కిచెన్ రూమ్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- పచ్చి మాంసం, కోడిగుడ్లు, చికెన్ పదార్థాలను వేర్వేరుగా నిల్వ చేయాలి. ఇతర ఆహార పదార్థాలతో కలపరాదు.
- పూర్తిగా వండిన తరువాత మాత్రమే భుజించాలి. మాంసాహారాన్ని 75 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో వేడి చేయాలి.
- ముడి మాంసం, సగం ఉడికించిన కోడి గుడ్లను తినరాదు.
- మాంసాహారాన్ని వండుకోవాలంటే తొలుత ముడి మాంసాన్ని ఉడకబెట్టిన తరువాత కడుక్కోవాలి.

పౌల్ట్రీ యజమానులు తీసుకోవలసిన జాగ్రత్తలు

- బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రధానంగా హెచ్7ఎన్4 అనే వైరస్ ద్వారా సోకుతుంది.
- పౌల్ట్రీ రైతులు, కార్మికులు, వైద్యులు తప్పనిసరిగా ఫారంలోకి వెళ్లే ముందు మాస్కులు, గ్లౌజులు, బూట్లు, హెడ్ కవర్ ధరించాలి.
- మృతి చెందిన కోళ్లను తగిన జాగ్రత్తలు తీసుకుని భూమిలో పాతి పెట్టాలి.
- కోళ్ల రవాణాకు ఉపయోగించే పాత్రలను, డబ్బాలను తరచూ శుభ్రం చేసుకోవాలి.
- పౌల్ట్రీ ఫారమ్ పరిసరాలను బ్లీచింగ్ పౌడితో శుభ్రపరచడం ద్వారా రోగ కారకాలను నిర్మూలించి పరిశుభ్రతను కాపాడుకోవాలి.
- అనధికార వ్యక్తులు ఫారంలోకి రాకుండా నిరోధించడం ద్వారా రోగాల సంక్రమణను తగ్గించవచ్చు.
- వాహనాలను శుభ్రపరచి డిస్ ఇన్‌ఫెక్ట్ చేయడం ద్వారా రోగకారకాలు రాకుండా చూసుకోవాలి.
- కీటక నాశనం వల్ల అంతర్గత పరాన్నజీవులను నిర్మూలించవచ్చు.

బర్డ్‌ఫ్లూ వైరస్ లక్షణాలు

- ముక్కు కారడం, గొంతు నొప్పి
- జలుబుతో ప్రారంభమై తలపోటుగా రూపాంతరం చెందుతుంది.
- జ్వరం 102 డిగ్రీల ఫారన్ హీట్ పైగా నిలకడగా ఉంటుంది.
- ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు విపరీతంగా ఉంటాయి
- శ్వాసకోశ సమస్యలు అధికంగా ఉంటాయి.
- జ్వర తీవ్రత అధికమై విరేచనాలు ఎక్కువగా అవుతాయి


బర్డ్ ఫ్లూ వ్యాధికారక హెచ్7ఎన్4 వైరస్


పౌల్ట్రీ ఫారం

అపోహలొద్దు



బర్డ్ ఫ్లూ వైరస్‌పై అపోహలు పడవద్దు. జిల్లా వ్యాప్తంగా ఈ వైరస్ ఆనవాళ్లు లేవు. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం లేదు. ముందు జాగ్రత్తలు తీసుకుంటే సురక్షితంగా బయట పడవచ్చు. చికెన్, కోడిగుడ్లను పూర్తిస్థాయిలో ఉడికించిన తరువాత మాత్రమే తినాలి. పరిశుభ్రత పాటించాలి.

– ఎల్.అనిత, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, ఆలమూరు

అవగాహన సదస్సులు ఏర్పాటు



జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తి–నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా పరిసర ప్రాంతాల్లో ఇప్పటి వరకూ బర్డ్‌ఫ్లూ కేసు నమోదు కానందున ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే సత్వరమే స్థానిక వైద్యారోగ్య సిబ్బందిని సంప్రదించి సమీప ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సను తీసుకోవాలి.

– డి.సువర్చలాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, చొప్పెల్ల

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

దేవస్థానం భూమి ఆక్రమణ ఫిర్యాదులపై సర్వే



అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి చెందిన భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదులు రావడంతో శుక్రవారం రెవెన్యూ, దేవస్థానం అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. రెండో ఘాట్‌రోడ్డును ఆనుకుని తారకరామాకాలనీ చుట్టుపక్కల గల సర్వే నంబర్ 124.ఏ కు చెందిన భూమిలో సర్వే నిర్వహించారు. ఈ సర్వే శనివారం కూడా కొనసాగుతుందని దేవస్థానం అధికారులు తెలిపారు. శంఖవరం మండల సర్వేయర్ దాలిరాజు, ఆర్‌ఐ ప్రసాద్, దేవస్థానం సీ సెక్షన్ ఏఈఓ పీ రెడ్డి, సూపరింటెండెంట్ వేంకట రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సర్వే అనంతరం పంపా ఘాట్ సమీపంలోని అభయ హోటల్ స్థలాన్ని కూడా సర్వే చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యాన్

కొత్తపల్లి: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను శుక్రవారం పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రమణక్కపేటలో రేషన్ బియ్యం ఒక వ్యాన్‌లో పిఠాపురం తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు పాత ఇసుకపల్లి సమీపంలో పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న గొల్లప్రోలుకు చెందిన వెలుగుల లక్ష్మణపై కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న 4,580 కేజీల రేషన్ బియ్యాన్ని పిఠాపురంలో ఉన్న పౌరసరఫరాల పాయింట్‌కు తరలించినట్లు సామర్లకోట ఎంఎస్‌ఓ కమల తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం రవాణా చేస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

కెనరా బ్యాంకులో గోల్డ్ లోన్ల గోల్‌మాల్

- జీఎంతో సహా ముగ్గురి సస్పెన్షన్
- గుట్టుచప్పుడు కాకుండా ఆడిట్
- ఆందోళనతో ఒక్కొక్కరిగా నగలు విడిపించుకుంటున్న వైనం


తేటగుంట కెనరా బ్యాంకు


బ్యాంకు మేనేజరు చాంబర్ వద్ద ఆందోళనతో రుణగ్రస్తులు

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల్లో గోల్‌మాల్ జరిగింది. ఈ వ్యవహారం వారం రోజుల కిందట బయటకు రావడంతో బ్రాంచి మేనేజరు సహా ముగ్గురిని సస్పెండ్ చేశారు. బాధితుల నుంచి అందిన సమాచారం మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి... తుని, తొండంగి, రౌతులపూడి మండలాల్లో కొన్ని గ్రామాలకు అందుబాటులో ఉండేవిధంగా తేటగుంట జంక్షన్‌లో జాతీయ రహదారిని ఆనుకుని కెనరా బ్యాంకును ఏర్పాటు చేశారు. అధికశాతం మంది రైతులు, గ్రామీణులు కావడంతో డబ్బు అవసరమైనప్పుడు బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టి నగదు తీసుకుంటూ ఉంటారు. డబ్బు సర్దుబాటయినప్పుడు తాకట్టులో ఉన్న బంగారు నగలను విడిపించుకుంటున్నారు. ఈ క్రమంలో తాకట్టు పెట్టిన నగలు విడిపించేందుకు రుణగ్రస్తురాలు బ్యాంకుకు వచ్చింది. వడ్డీతో సహా మొత్తం చెల్లించిన తర్వాత తాకట్టు పెట్టిన నగల్లో ఒక వస్తువు కనిపించలేదు. అదేవిధంగా మరో ఇద్దరికి తాకట్టు పెట్టిన నగలకు విడిపించిన తర్వాత చేతికి అందిన నగలకు వ్యత్యాసం వచ్చింది. దీంతో ఆందోళన చెందిన వీరు బ్యాంకు మేనేజరుకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నత అధికారులు మేనేజరుతో సహా ముగ్గురిని సస్పెండ్ చేశారు. తాకట్టుకు వచ్చిన బంగారు నగలను గీటురాయితో పరిశీలించి, స్వచ్ఛత నిర్ధారణ చేసే అప్రైజర్ (మదింపుదారు)అనుమతితో బ్యాంకుల్లో బంగారు నగలు తాకట్టు ప్రక్రియ జరుగుతుంది. గోల్‌మాల్ వ్యవహారం ఇక్కడ నుంచే జరిగినట్టు తెలుస్తోంది.

ఇలా బయటపడింది

ఒక మహిళ సంవత్సరం కిందట ఎనిమిది తులాల బంగారు నగలు (నాలుగు వస్తువులు) రూ.ఐదు లక్షలకు తాకట్టు పెట్టింది. వారం రోజులు కిందట వడ్డీతో సహా చెల్లించి నగలు విడిపించుకుంది. నాలుగు ఉండాల్సిన నగలు మూడు ఉన్నాయి. దీంతో ఒక వస్తువు గోల్‌మాల్ అయినట్టు గుర్తించింది. విషయం తెలియడంతో మరింతమంది తమ నగలను విడిపించుకునేందుకు బ్యాంకుకు వస్తున్నారు. దీంతో బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. బ్యాంకులో మూడు వేలకుపైగా గోల్డ్ లోన్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఇవన్నీ పరిశీలిస్తేనే ఎంతమంది బాధితులు ఉన్నారు. ఎంతమేరకు గోల్‌మాల్ జరిగిందో తెలుస్తుంది.

ఆడిట్ జరుగుతోంది : ఇన్‌చార్జి బీఎం యేసుదాసు

గోల్డ్‌లోన్ గోల్‌మాల్‌పై ఇన్‌చార్జి బీఎం యేసుదాసును వివరణ కోరగా ఆడిట్ జరుగుతోందని, ఇప్పటి వరకు 150 మంది రుణ మొత్తాలను చెల్లించి నగలు తీసుకున్నారని చెప్పారు. అందులో ఆరుగురి నుంచి తమ వస్తువులు కొన్ని లేవని ఫిర్యాదు వచ్చిందన్నారు. ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎటువంటి నష్టం జరగదన్నారు. నాలుగైదు రోజుల్లో ఆడిట్ పూర్తవుతుందని ఆయన వివరించారు.

హాకీ టోర్నీకి ఏర్పాట్లు పూర్తి



ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీల వేదిక డీఎస్‌ఏ ముఖద్వారం

- నేటి నుంచి 28 వరకు నిర్వహణ
- దేశవ్యాప్తంగా 880 మంది క్రీడాకారుల హాజరు


డీఎస్‌ఏ హాకీ మైదానం (ఫైల్)

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో శనివారం నుంచి జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్ల పూర్తయ్యాయి. శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి 44 జట్లు, 880 మంది క్రీడాకారులు, 100 మంది క్రీడాధికారులు పాల్గొంటున్నారు. హాకీ క్రీడాకారులకు అసౌకర్యం కలుగకుండా, వసతి, ప్రయాణ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్, ఆహారం, ప్రారంభోత్సవం సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వేదికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. మైదానంలో పారిశుధ్యం, మరుగుదొడ్లు, తాగునీరు, లైటింగ్, సౌండ్ సిస్టం వంటి ఏర్పాట్లను ఏయే ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సూచనల మేరకు అధికారులు సిద్ధంగా ఉంచారు. జాతీయ స్థాయిలో జరిగే ఆల్ ఇండియా సర్వీసెస్ హాకీ టోర్నమెంటుకు కాకినాడ జిల్లా ఆతిథ్యం ఇస్తున్న నేపథ్యంలో పోటీల నిర్వహణ ఏర్పాట్లు కలెక్టర్ షణ్మోహన్ స్వయంగా పర్యవేక్షించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ హాకీ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లు కాకినాడ ఆర్‌డీఓ మల్లిబాబు పర్యవేక్షణలో డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ పూర్తి చేశారు. ఈ పోటీలకు సంబంధించి ఇప్పటికే కలెక్టర్ నేతృత్వంలో విభాగాల వారీగా కమిటీలను జేసీ నియమించారు. ఆయా అంశాల వారిగా వివిధ శాఖల అధికారులకు కేటాయించిన పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జేసీ రాహుల్ మీనా సూచించారు. రియాజ్ అహ్మద్ (అర్జున అవార్డి), ఒలింపియన్ ముఖేష్‌కుమార్ పాల్గొంటున్నారు. కోకనాడ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు రవిచంద్ర, గంగాధర్, జిల్లా హాకీ సంఘం తరపున రవిరాజు సహకారం అందిస్తున్నారు.

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జి డీఐజీగా వెంకటేశ్వర్లు



కాకినాడ లీగల్: ఉమ్మడి జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జి డీఐజీగా భీమవరం జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఐజీగా ఉన్న బి.శివరామ్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందడంతో కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ జిల్లా కె.ఆనందరావును ఇన్‌చార్జి డీఐజీగా నియమించారు. అయితే భీమవరం జిల్లా రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు శుక్రవారం అప్పగించారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు ఈయన పరిధిలోకి వస్తాయి.


కాపవరంలో అగ్ని ప్రమాదం

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో నాగార్జున ఫెర్టిలైజర్స్ గ్రీన్‌ఫీల్డులో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగిదని అనపర్తి ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రీన్ ఫీల్డు కావటంతో చెట్లు పెరిగి ఉన్నాయి. సుమారు 200 ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డులో పది ఎకరాల్లో నిప్పు అంటుకుంటుందన్నారు. ఎవరో రోడ్డున వెళుతూ సిగరెట్ పీక విసిరి ఉంటారని, దానివల్ల ప్రమాదం జరిగిందని భావిస్తున్నట్టు తెలిపారు. ఆస్తినష్టం పదెకరాలు ఉంటుందని, ఎలాంటి పశునష్టం, ప్రాణనష్టం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

16న నెట్‌బాల్ పోటీలు

రావులపాలెం: స్థానిక డాన్‌బోస్కో స్కూల్ ఆవరణలో ఈ నెల 16న రాష్ట్రస్థాయి అండర్ –19 జూనియర్స్ బాలుర, బాలికల విభాగాల్లో నెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్రి అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. 13 జిల్లాల నుంచి 12 మంది బాలికల జట్లు, 12 బాలుర జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఫాదర్ ఐ.బల్తాజర్ తెలిపారు.

భీమేశ్వరస్వామికి వైభవంగా శ్రీ పుష్పోత్సవం


పుష్పోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబా అమ్మవారు


పుష్పోత్సవం పురస్కరించుకుని తాంబూలాలు అందుకుంటున్న దంపతులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీ పుష్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. క్షేత్రంలో కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్లకు ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య శాస్త్రోక్తంగా శ్రీ పుష్పోత్సవం నిర్వహించారు. పుణ్య దంపతులకు తాంబూలాలు అందజేశారు.

పెనుగుదురులో చోరీ

బంగారు, వెండి ఆభరణాల అపహరణ

కరప: మండలం పెనుగుదురులో ఒక ఇంటిలో దొంగలు పడి రూ.60 వేలు విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకుని పోయారు. కరప ఎస్‌ఐ టి.సునీత తెలిపిన కథనం మేరకు పెనుగుదురు గ్రామానికి చెందిన పబ్బినీడి అప్పారావు ఎల్‌ఐసీ ఏజంట్‌గా పనిచేస్తుంటాడు. అప్పారావు ఈ నెల 10న ఇంటికి తాళంవేసి, భార్యతో కల్సి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. 13వ తేదీన ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా 8 గ్రాములు బరువుండే రెండు జతల చెవిదుద్దులు, 550 గ్రాముల వెండిచెంబు, మరో 500 గ్రాముల వెండిగిన్నెలు, వెండి దీపపు కుందెలు అపహరించుకుని పోయినట్టు గుర్తించారు. బాధితులు కరప పోలీసులకు ఫిర్యాదు చేయగా కాకినాడ నుంచి క్లూస్‌టీమ్ వచ్చి, వేలిముద్రలు తదితర ఆధారాలు సేకరించి వెళ్లారు. ఈ మేరకు కరప ఎస్‌ఐ సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రహదారిపై వాహనాలు నడిపే వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.లక్ష్మి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం 2025 లో భాగంగా జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ ఆధ్వర్యంలో వాహన చోదకులకు రాజమహేంద్రవరంలోని ఎ.కె.సి. కాలేజీ సమీపంలో ఉన్న రోటరీ హాలులో ఇన్సూరెన్స్ క్లెయిమ్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఏదైనా ప్రమాదంలో అనుకోకుండా మరణించిన, అంగవైకల్యం ఏర్పడిన వారికి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం, పాక్షిక అంగవైకల్యం కలిగితే లక్ష సహాయం అందుతుందని తెలిపారు. చట్టపరమైన అంశాలలో లాయరు కేవి ఆర్ కె సుబ్బారావు అవగాహన కల్పించారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సంపత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్‌మెంట్ బీఎస్‌ఎం వల్లి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ ఎం. రవికుమార్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

సీతానగరం: గతంలో రఘుదేవపురం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన అప్పారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందాయని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 – 24లో రఘుదేవపురం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారని చెప్పారు. పంచాయతీ నిధులు రూ.15 లక్షలు దుర్వినియోగంపై అప్పారావును సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. సస్పెండ్ అయిన అప్పారావు ప్రస్తుతం అంబాజీపేట మండలం కె.పెదపూడి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారని ఈవోపీఆర్డీ మూర్తి తెలిపారు.